# అతీతుడు

"నాన్నా!" కొడుకు పిలుపుకి ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు రఘురామయ్య.
ఆమడదూరంలో నిల్చుని మాట్లాడుతున్న మాధవ్‌ని చూసి ఆయన హృదయం బాధగా మూలిగింది.
ఇదివరకు ఏం చెప్పాలన్నా మంచం మీద కూర్చుని, తన చేయి పట్టుకుని చెప్పేవాడు.
నిట్టూర్పునణచుకొని కొడుకు వైపు ప్రశ్నార్థకంగా చూశాడు.
"ఈరోజు మేమంతా రాజ్యం వాళ్ళింటికెళ్తున్నాం భోజనానికి. మీరు వస్తున్నారా!" అడిగాడు మాధవ్
"నాకు వేరే వంట చేసిందా కోడలు!"
"చేయమంటే చేస్తుంది." ఎంత మామూలుగా చెప్పాలని ప్రయత్నించినా చిరాకు ధ్వనించిందతని కంఠంలో.
అంతసేపు అక్కడ నిలబడడమే ఎంతో విసుగుగా వుందతనికి.
అంతా సిద్ధమై చెప్పుల్లో కాళ్ళు దూర్చడమే తరువాయి అన్నట్లు నిల్చున్న కోడల్నోసారి చూసి అన్నాడు రఘురామయ్య "వద్దులే. మీరు వెళ్లండి."
ఆమాట కోసమే ఎదురుచూస్తున్న లక్ష్మి స్థిమితపడింది. "రక్షించాడు. ఇపుడు మళ్ళీ వంటా గింటా అంటే చచ్చేదాన్ని" అనుకుంటూ.
రెండు నిమిషాల్లో వెళ్ళిపోయిన కొడుకునీ, కోడల్నీ, పిల్లల్నీ చూసి నిట్టూర్చాడు రఘురామయ్య. తనులేకుండా వాళ్ళు వెళ్ళిపోతారని ఆయన కనీసం ఊహించలేదు. అందరూ కలిసి ఈరోజు పెద్దకూతురింట్లో గడపాలని ఆయన ఎంతగానో అనుకున్నాడు. కానీ తనకు వంట అయినా చేయకుండా వెళ్ళిపోయిన వాళ్ళను చూస్తే ఆయనకి కోపం రాలేదు. విపరీతమయిన బాధ కలిగింది.
ఆయనకి మాధవ్ తర్వాత యిద్దరు ఆడపిల్లలు. రాజ్యం. సునీత. ఆయన వాళ్లని ఏ తండ్రీ పెంచనంత గారాబంగా పెంచాడు. తమకు తల్లి లేదన్న బాధో, మరో కష్టమో తెలిసే అవకాశం వాళ్ళకెపుడూ రాలేదు. వాళ్లకీ తండ్రంటే ఎంతో గౌరవం మొన్నటిదాకా. కానీ యిపుడు ఆ ప్రేమంతా పోయి కనీసం ఆయన ఎదురుగా నిల్చోవాలన్నా విసుగే వాళ్ళకి.

*****

మాధవ్ వాళ్లని రాజ్యం, గోపాలం సాదరంగా ఆహ్వానించారు. అప్పటికే సునీత, సుధీర్ కూడా వచ్చేశారు. ఆ అన్నాచెల్లెళ్ల మధ్య అభిమానం, ఆప్యాయత ఎక్కువ. అది వాళ్లకి పెళ్ళిళ్ళయ్యాక యింకాస్త పెరిగిందే కానీ తరగలేదు. తరచూ సెలవురోజుల్లో యిలా కలుసుకుని సరదాగా గడపడం వాళ్ళకి అలవాటు.

"నాన్న రాలేదా!" అంది సునీత.

"రానన్నారు, నేనూ బలవంతం చేయలేదు." చెప్పాడు మాధవ్.

"వంట చేసి వచ్చావా మరి!" అడిగింది రాజ్యం లక్ష్మిని.

"అక్కర్లేదుట. ఆవిడ వుందిగా, పెడుతుందేమో! మన వంటలూ, మన ప్రేమలూ సహించడం మానేసి చాలా రోజులయిందిలే." నిరసనగా చెప్పింది లక్ష్మి.

"అంతేలే వదినా! పట్టించుకోకుండా వదిలేయడమే నయం. ఆయన ఏవీ పట్టించుకోకుండా, నీతీ జాతీ వదిలేసి ఈ వయసులో యిలాంటి పనులు చేస్తున్నపుడు మనం మాత్రం పట్టుకు పాకులాడడం దేనికి!" నిట్టూర్చింది రాజ్యం.

"అసలు నాన్నగారు యిలా ఎందుకు చేస్తున్నారో! ఎపుడయినా అనుకున్నామా మనం నాన్నగారు యిలా చేస్తారని.." బాధగా అంది సునీత.

"అదేనే, ఆలోచిస్తే నాకూ ఎంత ఆశ్చర్యంగా వుంటుందో! ఎట్లా వుండేవారు నాన్నగారు! ఎంత ఠీవిగా, ఎంత నిగ్రహంగా. అందర్లో ఎంత గౌరవం! ఆయన గురించి ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ ఒక్క చెడ్డమాట మాట్లాడలేదు ఎవరూ యిప్పటిదాకా. అలాంటిది యిపుడు.." నిస్పృహగా అన్నాడు మాధవ్

తండ్రి రిటైర్ అవగానే తండ్రికి వచ్చే డబ్బుతో ఏదయినా వ్యాపారం చేయాలని, యిల్లు కట్టుకోవాలనీ ఏవేవో అనుకున్నాడు అతను.

కానీ ఆ డబ్బు ఒక్కపైసా కూడా కొడుక్కి యివ్వలేదు రఘురామయ్య. ఆయన రిటైర్ అవగానే ఆఫీస్ క్వార్టర్ ఖాళీ చేసి వేరే యింట్లోకి మారారు. అప్పట్నుంచీ మొదలయింది కథ.

ఆ యింటిగలావిడకి ఒక్కతే కూతురు. భర్త లేడు. ఆ అమ్మాయికి పాతికేళ్ళుంటాయేమో, అంతే.

అరవై ఏళ్ళ రఘురామయ్య ఎవరూ ఊహించని విధంగా డబ్బంతా ఆ అమ్మాయి కోసం ఖర్చు పెడుతున్నాడు.
మొదట్లో ఆ డబ్బు ఆయనేం చేశాడో ఎవరికీ అర్థం కాలేదు.
ఒకరోజు వాకిట్లోకి చీరలమ్మే అతను వచ్చాడు. ఆ అమ్మాయి అన్ని చీరలూ తీయించి చూసి, చివరికి "డబ్బుల్లేవు, వద్దు." అంది. వాకిట్లో కూర్చున్న రఘురామయ్య వెంటనే డబ్బులు తీసి.. "నేనిస్తాను. కొనుక్కో." అన్నాడు. అంతే. ఆ అమ్మాయి నాలుగు చీరలు కొనుక్కుంది.
ఇదంతా చూసిన లక్ష్మికి మతిపోయింది. అంతకు ముందురోజు ఆమె కూడా మాధవ్‌ని చీర కొనిపెట్టమని అడిగింది. తన దగ్గర డబ్బుల్లేకా, తండ్రిని అడగడానికి మొహమాటపడీ వూరుకున్నాడు మాధవ్.
వాళ్ళ వాదన అంతా ముసలాయన వింటూనే వున్నాడు. అంతా విన్నవాడు పోనీ తనని కొనుక్కోమనకపోతే పోనీ.., పరాయిపిల్ల ఆ అమ్మాయికి యివ్వడం ఏమిటో అర్థం కాలేదు ఆమెకి. "ఈయనకి డబ్బు మీద యింత కాపీనం ఏమిటి! ఇలా అందరికీ అప్పులిచ్చి, వడ్డీలు తీసుకుని దాచుకుంటాడు కాబోలు." అనుకుంది లక్ష్మి. అయితే ఆ డబ్బు ఆ అమ్మాయెక్కడా తిరిగి యిచ్చినట్లు కనబడలేదు. దాంతో యింకా ఆశ్చర్యపోయింది ఆమె.
ఆ అమ్మాయికి అంత ఉదారంగా ఊరికే యిచ్చినవాడు తమ వాదన అంతా వినికూడా పట్టించుకోకపోవడం ఏమిటి! అసలు ఆ రోజు మామగారు వినాలనే తను పెద్దగా వాదన వేసుకుంది. ఆయన దగ్గరి డబ్బు బయటికి ఎలా తీయించాలో అర్థం కాక, తామిద్దరూ వాదించుకుంటూంటే అది చూసి అయినా యిస్తాడేమో అనుకుంది. కానీ యిదేమిటి! వళ్ళు మండిపోయింది లక్ష్మికి.
ఒకరోజు కొడుకుతో చెప్పాడు రఘురామయ్య "నేనివాళ ఊరికి వెళ్తున్నానురా. రెండ్రోజుల్లో వస్తాను." అని.
రఘురామయ్యకి తను పుట్టి పెరిగిన పల్లెటూరికి అపుడపుడూ వెళ్ళి రావడం అలవాటు. రెండ్నెల్లకోసారయినా వెళ్ళి అక్కడ రెండ్రోజులుండి వస్తుంటాడు.
అలాగే వెళ్తున్నాడనుకున్న లక్ష్మి ఆరోజు సాయంత్రం కూతురి మాటలు విని ఆశ్చర్యపోయింది. సుమన అడిగింది స్కూలునుంచి రాగానే "అమ్మా! తాతయ్యా, ప్రక్కింటి ఆంటీ ఎక్కడికి వెళ్తున్నారూ!" అని.

"ప్రక్కింటి ఆంటీ వెళ్ళడం ఏమిటి! తాతయ్య ఒక్కరే వూరికి వెళ్ళారు." చెప్పింది లక్ష్మి.

సుమన చెప్పింది గట్టిగా "ఏం కాదు. నే చూశాను. ఇద్దరూ రిక్షాలో వెళ్తున్నారు. ఆంటీ కూడా బ్రీఫ్‌కేస్ పెట్టుకుని వుంది."

నివ్వెరపోయింది లక్ష్మి. అంతవరకూ ఆయన డబ్బులిచ్చినా, కబుర్లు చెప్పినా.. కొత్తగా పిసినారితనమొచ్చిందనీ, ముసలితనమొచ్చేసరికి యింట్లోవాళ్ళు పనికిరాకుండా పోయే చాదస్తం వచ్చిందనీ అనుకుంది కానీ మరోరకంగా మరోరకంగా ఊహించలేదు. ఇపుడు ఆ అమ్మాయితో కలిసి ఊరికి వెళ్లడమంటే దాన్నెలా తీసుకోవాలో లక్ష్మికి అర్థం కాలేదు. ఆ విషయం మాధవ్‌కి చెప్పచ్చో చెప్పకూడదో కూడా ఆమెకి తెలియలేదు. తండ్రంటే మాధవ్‌కి ఎంత ప్రేమో, ఎంత గౌరవమో ఆమెకి తెలియనిది కాదు. ఇపుడు ఈ విషయాన్ని అతనితో చెప్తే అతను నమ్ముతాడా! ఎదురు తననే తిడతాడా!

"ఆఅమ్మాయి కూడా ఊరికి వెళ్తోందేమో! ఇద్దరూ కలిసి స్టేషన్ దాకా ఒకే రిక్షాలో వెళ్ళారేమో.. తప్పేముంది!" అంటే..!

కానీ లక్ష్మికి ఎందుకో అలా అనుకోబుద్ధి కాలేదు. ఆ అమ్మాయితో మాట్లాడేటపుడు, ఆఅమ్మాయి ఏమైనా చేసి యిస్తే తినేటపుడు అసహజంగా కనిపించే ఆయన చూపులకి ఏదో అర్థం తెలిసినట్లుగా వుందామెకు. ఆఅమ్మాయికీ, మామగారికీ సంబంధం వుండడమే నిజమని నిర్ణయించేసింది ఆమె మనసు.

ఆ నిర్ణయానికి రాగానే ఆమె మనసంతా ఆయనపై విపరీతమయిన అసహ్యం అలముకొంది. కూతురివయస్సు పిల్లతో ఆయన ఆవిధంగా తిరగడం ఆమె జీర్ణించుకోలేకపోయింది. ప్రస్ఫుటంగా తెలియచేయకపోయినా అప్పటిదాకా ఆమెకీ మామగారిపై ఎంతో గౌరవముండేది. ఠీవిగా వుండే ఆయన విగ్రహం, అమ్మా.. తల్లీ అంటూ ప్రేమగా పిలిచే ఆయన మాటలూ ఆమెకు మామగారిపై ఎనలేని గౌరవాన్ని కలిగించాయి. ఇపుడు అదంతా సమూలంగా నాశనమయ్యి ఆ స్థానంలో విపరీతమయిన ఏవగింపు కలిగింది.

ఈ విషయం మాధవ్‌తో చెప్పేదాకా ఆమె మనసు మనసులో లేదు. ఎంతో ఆలోచించి, ఎన్నో రకాలుగా రిహార్సల్స్ చేసి ఆరాత్రి మాధవ్ చెవిన వేసింది ఆవిషయం. తిడతాడేమో, కోపం తెచ్చుకుంటాడేమో అని భయపడిన లక్ష్మి, భర్త అలాంటివేమీ

చేయకపోవడంతో స్థిమితపడింది. అంతా విని మెల్లగా అడిగాడు మాధవ్.. "నువు పొరపాటు పడలేదుగా లక్ష్మి!" అని.

భర్త ధోరణితో ధైర్యం వచ్చిన లక్ష్మి గట్టిగా చెప్పింది "ఇంకా నయం! ఆమాత్రం తెలీదూ నాకు! నాకు ఎపుడో అనుమానం వచ్చింది కానీ ఆయన మీద గౌరవంతో అలా అనుకోలేకపోయాను. ఆయన అలవాట్లన్నీ యిలాంటివే అయ్యుంటాయి. మనకు తెలిసేటట్లుగా చేయరు కాబట్టి మనం అంత గౌరవిస్తున్నాం..."

"సర్లే. పడుకో!" వినలేనట్లుగా కట్‌చేసి పడుకున్నాడు మాధవ్.

మాధవ్ అంతగా ఆశ్చర్యపడకపోవడానికీ, కోపం తెచ్చుకోకపోవడానికీ కారణం వుంది. ఆరోజే అతని ఫ్రెండ్ రాజేష్ వచ్చాడతని దగ్గరికి.

వచ్చిన కాసేపటికి., సంకోచిస్తూ చెప్పాడతను.. "నిన్న మీ నాన్నగార్ని సినిమా థియేటర్లో చూశానోయ్" అని.

"అవునా!" నవ్వుతూ అన్నాడు మాధవ్ "సినిమాకొచ్చారా నాన్నగారు నిన్న! నాతో చెప్పలేదే! నువు కనిపించినట్లు కూడా అనలేదు."

తలవంచుకుని చెప్పాడు రాజేష్ "నాకు తెలుసు చెప్పరని. నీకెలా చెప్పాలో నాకు తెలియడం లేదు. మి నాన్నగారంటే నీకెంత గౌరవమో నాకు తెలుసు. కానీ చెప్పకుండా వుండలేకపోతున్నాను." అయోమయంగా చూస్తున్న మాధవ్‌ని ఓసారి చూసి కొనసాగించాడు రాజేష్. "నిన్న మీ నాన్నగారు ఒక్కరూ రాలేదు. వెంట మరో అమ్మాయి కూడా వుంది. చిన్న అమ్మాయిలానే వుంది చూడటానికి. పాతికేళ్ళుంటాయేమో! నాకెందుకో వారి సంబంధాన్ని సహజంగా తీసుకోవాలనిపించలేదు. పైగా నన్ను చూడగానే మీనాన్నగారు ఆఅమ్మాయి చేయి పట్టుకుని గబగబా యింకొక వైపుకి తీసుకువెళ్ళారు. ఆయనకి యిష్టం లేదని గ్రహించి నేనూ ఆయన్ని చూడనట్లుగా నటించాను."

"నువ్వు సరిగా చూశావా!" గొంతు తడారిపోతుంటే అడిగాడు మాధవ్.

"భలేవాడివి మాధవ్. మీనాన్నగారిని గుర్తుపట్టలేనా నేను! నేను కూడా అలా అనుకోవడానికి చాలా బాధపడ్డాను. ఆయనంటే నాకూ చాలా గౌరవమే. కానీ వాళ్ళిద్దరినీ ఓ పదినిమిషాలు గమనించినా చాలు అర్ధమయిపోతుంది వాళ్ళ మధ్య వున్న సంబంధమెలాంటిదో."

ఆమాటలు విన్నప్పటినుండీ మాధవ్ మనసంతా అయోమయంగా వుంది. ఇపుడు లక్ష్మి చెప్పిన మాటలు వినగానే అది యింకా ఎక్కువయింది. తనకెంతో నమ్మకమయిన స్నేహితుడు, ప్రాణంలో ప్రాణంగా మసిలే భార్యా చెప్పినా కూడా అతను ఆవిషయాన్ని నమ్మలేకపోతున్నాడు. "వాళ్ళిద్దరూ పొరపాటు పడి వుండచ్చు కదా!" అనుకుంటున్నాడు.

అతనికి తండ్రంటే వున్న నమ్మకం, గౌరవం సామాన్యమయినవి కావు. చిన్నప్పటినుంచీ తండ్రి తమని పెంచిన తీరు, ఆ తండ్రి బిడ్డలుగా తాము అందరిలో పొందిన ఆదరణ అతను మర్చిపోలేదు. అతనికి తెలిసినంతవరకూ తండ్రంటే అందరికీ అమితమయిన గౌరవం. ఆఫీసులోగానీ, బంధువుల్లోగానీ, చుట్టుప్రక్కలగానీ అందరూ ఆయన్ని విపరీతంగా అభిమానించేవారు. అందుకే అతను నమ్మలేకపోయాడు. అయితే చాలా త్వరలోనే నమ్మవలసి వచ్చింది అతను కూడా.

రెండోరోజు సాయంత్రం రఘురామయ్య తిరిగి వచ్చాడు. ఆయన వచ్చిన కాసేపటికే ఆ అమ్మాయి కూడా వచ్చింది. ఆరోజు రాత్రి మామూలుగానే భోజనం చేసి వరండాలో పడుకున్నాడు రఘురామయ్య. అందరూ నిద్రపోయినా మాధవ్‌కి నిద్రరాలేదు. నిజానికి ఆ రెండ్రోజులనుంచీ అతనికి నిద్ర లేదు. ఆకలి లేదు. ఆవిషయం అబద్ధమని తేల్చుకునేదాకా అతనికి యింకేమీ తోచదు. కానీ అది ఎలా తేల్చుకోవాలో అతనికి అర్థం కావడంలేదు.

అసహనంగా పక్కమీద దొర్లుతున్న మాధవ్‌కి చిన్నగా మాటలు వినిపించాయి. అతను గబగబా లేచి వెనకవైపు తలుపు తీసుకుని, అటునుంచి తిరిగి ముందువైపుకు వచ్చాడు. అంతే. అక్కడి దృశ్యం చూసి ఓ అగ్నిపర్వతం గుండెలమీద పడినట్లుగా ఫీలయ్యాడు మాధవ్.

తండ్రి మంచంపై ఆమె.. తండ్రి చేతుల్లో ఆమె.. తండ్రి గుండెలపై ఆమె..

అది చూశాక కూడా యింకా తండ్రిని గౌరవించలేకపోయాడు మాధవ్. ఇక ఆ తర్వాత ఆవిషయం లక్ష్మి పుణ్యమా అని అంతా పాకింది. కూతుర్లూ, అల్లుళ్ళూ.. అందరికీ తెలిసింది. కూతుళ్ళిద్దరూ తండ్రిని గమనించి, నిజం అని తెలుసుకున్నాక ఆయనతో మాట్లాడడం మానేశారు. ఆయన మొహం చూడడం యిష్టంలేక వాళ్ళింటికి రావడమే మానేశారు. లక్ష్మి, మాధవ్‌లే వెళ్తుంటారు అపుడపుడూ వాళ్ళ యిళ్ళకి.

*****

రాజ్యం వాళ్ళింట్లోనే రాత్రి భోజనాలు కూడా కానిచ్చి యింటికి వచ్చిన మాధవ్‌కి తండ్రి పడుకుని వున్న తీరు చూడగానే కొంచెం బాధ వేసింది. ఆయన ప్రొద్దున్నుంచీ ఏమీ తినలేదని చూడగానే అర్థమయింది. కానీ తన బాధ బయటపడనీయకుండా లోపలికి వెళ్ళిపోయాడు. ఆయన భోజనం గురించి ఎవరూ ఆలోచించలేదు. "ఆకలేస్తే ఆఅమ్మాయినడిగి పెట్టించుకుని తింటాడ్లే." అంది లక్ష్మి.

నిద్రకి ఉపక్రమించబోతూన్న మాధవ్ టేబిల్ మీద ఏదో కాగితం వుండడం చూసి యథాలాపంగా చేతిలోకి తీసుకున్నాడు. తనని సంబోధిస్తూ, తండ్రి సంతకంతో వున్న ఆ ఉత్తరం చూడగానే అతనికి అది అప్పుడే వ్రాసినదని అర్థమయింది. దేన్ని గురించి వ్రాశాడా అన్న ఆలోచనతో.. దాన్ని గురించి వ్రాయగలిగాడా అన్న ఆశ్చర్యంతో అక్షరాల వైపు దృష్టి సారించాడు మాధవ్.

"నాన్నా మధూ!

ఎంత బాగా సాధిస్తున్నార్రా నన్ను. భేష్ .. చాలాబాగా హింసిస్తున్నారు. కానీ ఒకటే అర్థం కావట్లేదురా. ఎందుకు హింసిస్తున్నారూ అన్నది. నేనేం తప్పు చేశానూ అన్నది. ఒరేయ్, నాకు యిరవైఏడేళ్ళురా మీఅమ్మ పోయినపుడు. అప్పట్నించీ నేనేనాడూ బాధ్యతారహితంగా ప్రవర్తించలేదు. ఏ స్త్రీనీ కన్నెత్తి చూడలేదు. మీరు అన్యాయమయిపోతారేమో అని మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు. ఏ వ్యసనాలూ లేవు. ఎంత కష్టపడినా, ఎంత సంపాదించినా అంతా మీకోసమే. అదంతా నాగొప్పతనమని చెప్పుకోవడం లేదు. నాకు తెలుసు, అదంతా నా బాధ్యత. కానీ నేను మహానుభావుడ్నేమీ కాదు. బాధ్యత కోసం నాలో చెలరేగే కోరికలని చంపుకోగల శక్తివంతుడ్ని కాదు. కాకపోతే.. కోరికలతో పాటు బాధ్యతలనీ ప్రేమించగలిగిన వాడ్ని కాబట్టి నా కోరికలని కొన్నాళ్ళు వాయిదా వేసుకున్నాను.

మధూ! మీకన్నీ చేశాను.. ఉద్యోగాలూ.. పెళ్ళిళ్ళూ.. అన్నీ. ఇంకా నేను రిటైర్ అయ్యాక వచ్చే డబ్బు కూడా మీకే యివ్వాలని నేను అనుకోలేదురా. బాధ్యతలన్నీ ఒక్కడ్నే మోసిన అలసటతో, వాటిని సక్రమంగా నెరవేర్చిన ఆనందంతో ఆ డబ్బు నాకోసం ఖర్చు పెట్టుకుందామనుకున్నాను.

నా డబ్బు కోసమే కావచ్చు.. అయినా నన్ను అభిమానిస్తూ, నాకు యిష్టమయిన పిండివంటలు చేసి పెడ్తూ, తెల్లవారుఝామునే లేచి, పాలు రాగానే కాఫీ యిచ్చి, నాకు తోచనపుడు నాతో చెస్ ఆడి.. ఆ అమ్మాయి నాకు ఆనందాన్నే యిచ్చింది.
నేనీ వయసులో ఆపని చేయడం మీకు అసహ్యం కలిగించింది. కానీ మధూ! వయసుకూ, కోరికలకూ సంబంధం ఏముందిరా! నువు పదేళ్ళయినా లేకుండానే సైకిల్ కావాలంటే నేను కొనలేదూ! పన్నెండేళ్ళు వచ్చీరాకముందే "గొలుసు కావాలి నాన్నా" అని రాజ్యం అంటే కొనిపెట్టలేదూ! బాగా చదువుకుని పైకొస్తుందనుకున్న సునీత, పదహారేళ్ళకే "ప్రేమించా" నంటే పెళ్ళి చేయలేదూ! మరి నా అరవై ఏళ్ళ వయసులో నేను కాస్త అసహజమయిన కోరిక కోరానని మీరంతా ఎందుకురా నన్నింత సాధిస్తున్నారు! నాతో మాట్లాడండిరా. నేను ఆ సుఖం కోసం మీఅందర్నీ వదులుకోవాలనీ, నాకు ఏదో ఒకటే ప్రాప్తమనీ అనుకోలేదు. మీరు నన్ను అర్థం చేసుకుంటారనుకున్నాను. అది నా తప్పు కాదుగా.

-నాన్న. "

మాధవ్ నిశ్చేష్టుడయ్యాడు. ఇన్నాళ్ళూ అంతటి తప్పు తండ్రి ఎందుకు చేస్తున్నాడా అని వాపోయిన మాధవ్.. యిపుడు అసలు "అందులో తప్పేమిటి!" అన్న తండ్రి వాదన విని నివ్వెరపోయాడు.
నిజమా! తప్పేం లేదా అందులో! కొడుకూ, కోడలూ, మనవళ్ళూ .. అందరూ తిరిగే యింట్లో యిలాంటి పని చేయడంలో తప్పు లేదా!
అంత దూరం ఆయన ఆలోచించి వుండకపోవచ్చు.
సహజమే. ఒక్కొక్క మనిషి ఒక్కొక్క కోణంలోనుంచి ఆలోచిస్తాడు.
వయసులో వుండగా రెండో పెళ్ళి చేసుకోవడం సమాజం ఆమోదించిన విషయం. కానీ తన తండ్రి అది తప్పనుకున్నాడు. దానివల్ల పిల్లలకి నష్టం అని భావించి ఆపని మానేశాడు.
ఇపుడు తను చేసే పని వల్ల ఎవరికీ నష్టం లేదనీ.. అది తన స్వవిషయమనీ భావిస్తున్నాడు.
ఆపని తప్పా, కాదా అన్న విషయాన్ని పక్కకి పెడితే ఒక్కటి మాత్రం నిజం.

దగ్గరి మనుషులు.. మనమీద ప్రేమ వున్న మనుషులు.. మన ప్రేమని ఆశిస్తూన్న మనుషులు చేసిన ఒక పని వల్ల మనకి యిబ్బంది కలిగితే, దాన్ని చర్చల ద్వారా వాళ్ళకి తెలియచెప్పచ్చు. ఇరుపక్షాలూ మాట్లాడుకుని యిద్దరికీ ఆమోదయోగ్యమయిన పరిష్కారం కనుక్కోవచ్చు.

అంతేకానీ.. అంతేకానీ ఆమనిషిని వెలివేయనక్కరలేదు. అసలతనికి తన వాదన వినిపించే అవకాశమే యివ్వకుండా హింసించనక్కరలేదు. ఆ ఆలోచన రాగానే యిన్నాళ్ళూ తండ్రిని తామెంత క్షోభ పెట్టిందీ గుర్తొచ్చి విపరీతమయిన దుఃఖం కలిగింది మాధవ్‌కి. కళ్ళనీళ్ళతో వరండాలోకి వచ్చాడు. మెల్లగా, ప్రేమగా, గౌరవంగా తండ్రి దగ్గరికి వెళ్ళాడు. వణికే చేతులతో ఆయన చేతిని అందుకోబోయిన మాధవ్ వులిక్కిపడ్డాడు. చల్లగా తగిలిన ఆయన దేహం నిర్లిప్తంగా వుంది.. అన్ని కోర్కెలకీ అతీతంగా.

*****